APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 24 అక్టోబర్ 2026 సంపుటి: 01 సంచిక :146 పేజీలు : 04 వెల: 2-00/-

మారుమూల గ్రామం నుంచి పారా అథ్లెటిక్స్‌లో

ప్రపంచ విజేతగా - దీప్తి జీవాంజి సక్సెస్ స్టోరీ



జీవాంజి దీప్తి పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో సత్తాచాటిన తెలుగమ్మాయి. అర్జున అవార్డు గ్రహీత. మరోసారి దేశం గర్వించేలా చేసింది ఈ యువ క్రీడా కెరటం.

ఢిల్లి : జీవాంజి దీప్తి పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో సత్తాచాటిన తెలుగమ్మాయి. అర్జున అవార్డు గ్రహీత. మరోసారి దేశం గర్వించేలా చేసింది ఈ యువ క్రీడా కెరటం. ఇటీవల జపాన్ వేదికగా జరిగిన పారాలింపిక్స్ లో మిగతా..2లో

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు.

తుమ్మిడిహెట్టి, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులపై చర్చించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 23: ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులపై చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మిగతా..2లో

ఏపీకి తుపాను ముప్పు - బంగాళాఖాతంలో

అల్పపీడనం, భారీ వర్షాల హెచ్చరిక



★ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈనెల 26 నాటికి తుపానుగా మారనుంది.


★ దీని ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

అమరావతి: రాష్ట్రానికి మరో తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న మూడు రోజుల్లో మరింత బలపడి కోస్తాంధ్ర తీరానికి చేరే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ కీలక సమావేశం

- చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు
- రెబల్స్ సమస్యను పరిష్కరించి, సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం





అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ ముగిసింది. సీఎం నివాసంలో సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. అదేవిధంగా, ఫేక్ వాట్సాప్ గ్రూపుల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

అల్లూరి జిల్లాలో రేకుల షెడ్డు కింద

విద్యార్థుల చదువులు



- రేకుల షెడ్డు కింద చదువులు.. స్పందించిన మంత్రి లోకేశ్
- డూంబ్రిగూడ మండలానికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- పాఠశాల భవనాన్ని తక్షణమే బాగుచేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి : అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల షెడ్డు కింద చదువుకుంటున్న దుస్థితిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. మిగతా..2లో

రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు..

శశీ థరూర్ కౌంటర్



★ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ దృష్టి సారించింది కాబట్టే ఆయనను చెడ్డ వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు.

దేశం ముందు వాస్తవాలు పెట్టండి'

మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు

చైనా పాలసీపై తీవ్ర విమర్శలు

- భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే.
- చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని ఆరోపించారు.



ఢిల్లి : అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైన్యంతో కొనసాగుతున్న ఘర్షణలపై ప్రధాని మోదీ, కేంద్రం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ముఖ్యంగా భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే. చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని, ఇకనైనా ప్రధానమంత్రి మోదీ దేశం ముందుకు వచ్చి అసలు వాస్తవాలు ఏంటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. మిగతా..2లో

- సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, రుగ్మతలను ఎదుర్కోవడంతో పాటు దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకం కావాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు
- 'గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది. దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి. కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి.

ఢిల్లి:: విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి



దిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరగనున్న చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. మిగతా..2లో

యాడికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జెడ్పిటిసిగా నామినేషన్ దాఖలు చేసిన గొర్తి రుద్రమ నాయుడు



యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(23) : తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి గారు, జేసీ ప్రభాకర్ రెడ్డి గారి ఆశీస్సులతో నేడు యాడికి మండల తెలుగుదేశం పార్టీ రాజ అభ్యర్థిగా గొర్తి రుద్రమ నాయుడు అనంతపురం జడ్పీ ఆఫీస్ నందు నామినేషన్ వేయడం జరిగింది. మాదాల పురోషోత్తం నాయుడు. దామినేని నరసింహ చౌదరి ఉమేష్ చంద్ర. తెల్లాకుల వెంకటేష్ పాల్గొన్నారు

CHANGE OF NAME

Harijana Anjineyulu Changes Name to Manavala AnjineyuluPamidi, Anantapur District: Harijana Anjineyulu, son of Obulesu, a 53-year-old resident of Government Layout, near AP TIBCO Houses in Pamidi, Anantapur district, has declared his decision to change his name to Manavala Anjineyulu through a sworn affidavit. According to the affidavit executed on October 21, 2026, the individual stated that his former name was Harijana Anjineyulu and that he wishes to be known as Manavala Anjineyulu, son of M. Obulesu. He affirmed that he is an Indian citizen and that the details furnished in the affidavit are true to the best of his knowledge and belief.The affidavit was attested by V. Janardhan, Advocate and Notary, Andhra Pradesh.

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం పెంచాలి

- దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానం, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకుంటామని వెల్లడి
- హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు ప్రకటన
- నేరాల నియంత్రణకు హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాల ఏర్పాటు
- సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని సీఎం వెల్లడి



హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ మిగతా..2లో

ఈనెలాఖరులోగా లబ్ధిదారుల

ఎంపిక పూర్తి చేయాలి



- క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు.
- లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు.

హైదరాబాద్: హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్ రూమ్

మొదటి పేజి తరువాయి

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావం, నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు కేటాయించాలని, అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదులకు అదనంగా 0.6 టీఎంసీల నీరు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర వ్యవస్థల పనులు వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

అల్లూరి జిల్లాలో రేకుల షెడ్డు కింద విద్యార్థుల చదువులు

పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, అల్లూరి సీతారామరాజు జిల్లా దూంబ్రిగూడ మండలంలోని ఓ పాఠశాలలో సరైన భవన సదుపాయం లేదు. దీంతో అక్కడి విద్యార్థులు ఓ తాత్కాలిక రేకుల షెడ్డు కింద కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. ఈ హృదయవిదారక దృశ్యాలను ఓ యువకుడు వీడియో తీసి, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎ' (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో కొద్ది సమయంలోనే వైరల్‌గా మారి, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. ఈ పోస్ట్‌పై స్పందించిన మంత్రి నారా లోకేశ్, సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాన్ని తక్షణమే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యపై మంత్రి లోకేశ్ వేగంగా స్పందించి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ఏపీకి తుపాను ముప్పు - బంగాళాఖాతంలో అల్పపీడనం, భారీ వర్షాల హెచ్చరిక

దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ నెల 26న తుపానుగా : ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. రేపటికి అదే ప్రాంతంలో ఇది వాయుగుండంగా మారనుంది. ఎల్లుండికి తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందుతుంది. ఆ తర్వాత మరింతగా బలపడి ఈనెల 26వ తేదీ ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపానుగా మారిన తర్వాత రెండు రోజుల్లో ఇది ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాయలసీమలో భారీ వర్షాలు : ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇవాళ రాయలసీమలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. రేపు, ఎల్లుండి రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. తీరం వెంబడి వాతావరణం అల్లకల్లోలంగా మారనుంది. గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మత్స్యకారులు తిరిగి రావాలని ఆదేశాలు : వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నందున సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. వాతావరణం కుదుటపడే వరకు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు.. శశీ థరూర్ కౌంటర్

ఓ విఫల వ్యక్తి విజయం కోసం కాంగ్రెస్ పదే పదే ప్రయత్నిస్తోందన్న ప్రధాని కామెంట్స్‌పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ యువ ఓటర్లలో రాహుల్ గాంధీ నూతన ఉత్తేజాన్ని రాజేశారని శశిథరూర్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.

ఈఫిల్ టవర్ వివాదంపై బ్రహ్మవిహారి స్వామీజీ వివరణ.. బాప్స్‌పై

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని అన్నారు. పార్టీకి భిన్నమైన అభిప్రాయాలను తానూ అనేక సార్లు వ్యక్తం చేశానని చెప్పారు. కానీ పార్టీలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరించే విధానాలు, సిద్ధాంతాలు దేశాభివద్ధికి అనుగుణంగా ఉంటాయని ఎంపీ శశీథరూర్ తెలిపారు. అందుకే తాను పార్టీ విధానాలకు మద్దతు ఇస్తున్నానని చెప్పారు. బీజేపీతో ఢీ అంటే ఢీ అనేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'తన విఫల ఉత్పత్తి కోసం యావత్ దేశాన్ని కాంగ్రెస్ ఇంకా ఎంత కాలం పణంగా పెడుతుందో నాకు అర్థం కావట్లేదు. తమ నేతను లాంచ్ చేసేందుకు కాంగ్రెస్ చేసినన్ని ప్రయత్నాలు శ్రీహరికోటలో (రాకెట్ ప్రయోగ కేంద్రం) కూడా జరిగి ఉండవు' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

అమితాబ్ బచ్చన్ నివాసం, ముంబయి మేయర్ ఆఫీస్ కు బాంబు బెదిరింపులు- అప్రమత్తమైన అధికారులు

ముంబయి మున్సిపల్ కార్పోరేషన్, సీనియర్ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసం, గాయకుడు దిల్జిత్ దోసాంజ్ కచేరీ జరిగే ప్రదేశంలో బాంబు దాడులు చేస్తామని దుండగులు శుక్రవారం ఈమెయిల్స్ పంపారు. దీంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమైంది. మహారాష్ట్ర ముంబయిలోని వివిధ ప్రాంతాలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. ముంబయి మున్సిపల్ కార్పోరేషన్ తో పాటు, సీనియర్ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసం, గాయకుడు దిల్జిత్ దోసాంజ్ కచేరీ జరిగే ప్రదేశంలో బాంబు దాడులు చేస్తామని దుండగులు శుక్రవారం ఈమెయిల్స్ పంపారు. అక్టోబర్ 31, నవంబర్ 27 తేదీల్లో వివిధ ప్రాంతాల్లో పేలుళ్లు జరుపుతామని దుండగులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ మెయిల్స్ నేపథ్యంలో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ఆయా ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించింది.

పోలీసుల సమాచారం ప్రకారం,

డిప్యూటీ మేయర్ సంజయ్ ఘాడీకి పంపిన ఈమెయిల్‌లో, అక్టోబర్ 31న ఒక పాఠశాలపై గ్రెనేడ్ దాడి చేస్తామని, నవంబర్ 27న మహాలక్ష్మి రేస్ కోర్స్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటామని దుండగులు పేర్కొన్నారు. ఆ ఈమెయిల్‌లో ఖలిస్థాన్ నేషనల్ ఆర్మీ, బబ్బర్ ఖల్సా అనే సంస్థల పేర్లను పేర్కొన్నారు. "ముంబయి మేయర్ కార్యాలయం మధ్యాహ్నం 3.11 గంటలకు, ఆ తర్వాత అమితాబ్ బచ్చన్ జల్సా నివాస్ మా లక్ష్యం. 1984 అల్లర్లకు మేం ప్రతీకారం తీర్చుకుంటాం. నవంబర్ 27న మహాలక్ష్మి రేస్ కోర్స్ ను పేల్చివేస్తాం" అని మెయిల్ లో పేర్కొన్నారు. వాటితో పాటు, గురునానక్ సింగ్, కొంకణ్ షా వాలా, డాక్టర్ గుర్బీర్వర్ సింగ్, ఖాన్ రాజ్దా, ప్రొఫెసర్ గురుకల్ సింగ్, ఖేమ్ కరణ్, గుర్‌గార్ సింగ్ పేర్లను ప్రస్తావించారు.ఆ ప్రాంతాల్లో టైట్ సెక్యూరిటీ బాంబు బెదిరింపు నేపథ్యంలో, సదరు సందేశం ఎంతవరకు నిజమో నిర్ధరించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు, అలాగే పంపిన వ్యక్తిని గుర్తించేందుకు భద్రతా సంస్థలు దృష్టి సారించాయని అధికారులు తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యగా, మేయర్ కార్యాలయం, మహాలక్ష్మి రేస్‌కోర్స్, నగరంలోని ప్రముఖ విద్యా సంస్థలు, ఈమెయిల్‌లో పేర్కొన్న ఇతర ప్రాంతాల వద్ద భద్రతను, నిఘాను గణనీయంగా పెంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ప్రధాన కార్యాలయంలోని మేయర్ కార్యాలయంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా, ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు.కోల్ కతాలోని విమానాశ్రయానికి బాంబు బెదిరింపుఇదిలా ఉండగా, బంగాల్ , దిల్లీలో కూడా కొన్ని చోట్ల శుక్రవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. కోల్ కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని బోర్డింగ్ గేట్ వద్ద బాంబ్ పెట్టినట్లు టిష్యూ పేపర్ పై రాసి ఉండటాన్ని టాయ్ లెట్ సిబ్బంది గుర్తించింది. వెంటనే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎయిర్ పోర్టు అంతటా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

(ఎస్ఆర్‌పీసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ-సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజితా బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు.


ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు.

మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మాణం

హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలన్నీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి, ఆన్‌లైన్ విధానంలో డ్రా నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎప్పుడైనా చూసుకునేలా యూట్యూబ్‌లో పెట్టాలన్నారు. క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం భూములు గుర్తింపు

ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం మొదటి విడతలో మిగిలిన నియోజకవర్గాలతో పాటు రెండు, విడతల కోసం యుద్ధప్రాతిపదికన స్థలాలు గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ టవర్లు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అన్ని నియోజకవర్గాల్లో భూములు గుర్తించాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. భూముల గుర్తింపు నుంచి నిర్మాణాలు పూర్తయ్యే వరకు ప్రతీ దశలోనూ నిర్దిష్ట కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, గృహనిర్మాణ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తదుపరి విడతలో కొత్త దరఖాస్తుదారులు

ఇటీవల ప్రతి అపార్ట్ మెంట్ కు సంబంధించిన భూమిలో వాటాను సైతం రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. వచ్చే ఏడాది బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారికి తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని ప్రకటించారు.

మారుమూల గ్రామం నుంచి పారా అథ్లెటిక్స్‌లో ప్రపంచ విజేతగా - దీప్తి జీవాంజి సక్సెస్ స్టోరీ

మొదటి పేజీ తరువాయి

గోల్డ్ మెడల్ సాధించి మువ్వన్నెల జెండా ఎగురవేసింది. తెలంగాణలోని మారుమూల గ్రామం నుంచి పారా అథ్లెటిక్స్‌లో మేటి క్రీడాకారిణిగా ఎదిగిన దీప్తి. ఎంతో మంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆమె స్టోరీ ఇప్పుడు చూద్దాం. దీప్తి జీవాంజిది వరంగల్ జిల్లా కల్లెడ స్వస్థలం. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి. సాధారణ కూలీ కుటుంబం. కడు పేదరికం, మారుమూల గ్రామీణ నేపథ్యం, తన రూపం, మానసిక స్థితి చూసి నలుగురూ చేసిన వెక్కిరింపులు. ఇవేవీ ఆమె పట్టుదలకు అడ్డుకట్ట వేయలేకపోయాయి. అవమానాలన్నింటినీ దిగమింగుకుని అథ్లెటిక్స్‌లో అడుగుపెట్టింది. పాఠశాల దశలోనే ఆమెలోని పరుగు ప్రతిభ గుర్తించిన పీఈటీ టీచర్ ప్రోత్సాహంతో జర్నీ మొదలు పెట్టింది దీప్తి. కోచ్ పుల్లెల గోపీచంద్ సహకారం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ ఎన్. రమేశ్ మార్గనిర్దేశం, ఈనాడు సీఎస్ఆర్ లక్ష్య కార్యక్రమం అండతో మేటి రన్నర్‌గా ఎదిగింది. నేడు ప్రపంచ స్థాయిలో పతకాలు అందుకుంటోంది. జపాన్ వేదికగా జరిగిన ఆసియా పారా గేమ్స్ మహిళల 400 మీటర్ల టీ20 విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. కేవలం 56.36 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుని రికార్డు నెలకొల్పింది. 400 మీటర్ల రేసులో గోల్డ్ మెడల్ : తొలినాళ్లలో స్థానిక వేదికలకే పరిమితమైన దీప్తి, అనతికాలంలోనే ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ లో సత్తా చాటింది. 2022లో మొరాకో వేదికగా జరిగిన ప్రపంచ పారా గ్రాండ్ ప్రిలో టీ-20 విభాగం 400 మీటర్ల రేసులో గోల్డ్ మెడల్ సాధించి తొలి అంతర్జాతీయ పతకం అందుకుంది. అదే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగిన వర్చుస్ ఆసియానియా పోటీల్లో 200, 400 మీటర్ల విభాగాల్లో 2 స్వర్ణాలు కైవసం చేసుకుంది. 2023 పారా ఆసియా గేమ్స్‌లో 400 మీటర్ల రేసును 56.69 సెకన్లలో పూర్తి చేసి ఆసియా రికార్డు సృష్టించింది. ప్రపంచ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. దీప్తి పుట్టినప్పుడు తల చిన్నగా ముక్కు, పెదాలు పెద్దగా ఉండటంతో ఇరుగు పొరుగు ఎగతాళి చేస్తూ మాట్లాడేవారు. అనాథాశ్రమంలో వదిలేయమంటూ సలహాలు ఇచ్చారు. దీప్తి తల్లిదండ్రులు మాత్రం అవేం పట్టించుకోలేదు. వారి అండతో ఆ విమర్శలన్నింటినీ గెలుపు మెట్లుగా మలచుకుంది. పారిస్ పారాలింపిక్స్‌లో సాధించిన విజయంతో పాటు తన క్రీడా ప్రస్థానాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత క్రీడా పురస్కారం అర్జున అవార్డుతో గౌరవించింది. దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ప్రపంచ క్రీడా మహా సమ్మేళనమైన పారిస్



పారాలింపిక్స్-2024లో దీప్తి జీవాంజి దేశం గర్వించేలా చేసింది. మహిళల 400 మీటర్ల టీ20 ఫైనల్ ఉత్కంఠభరిత పోరులో ప్రతిభ కనబరుస్తూ కాంస్యం సొంతం చేసుకుంది. ఈ రేసును కేవలం 55.82 సెకన్లలో అత్యుత్తమ వ్యక్తిగత వేగం రికార్డ్‌ను నమోదు చేసింది. పారిస్ పారాలింపిక్స్‌లో పతకం సాధించిన ఏకైక తెలుగమ్మాయిగా చరిత్ర సృష్టించి తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లింది. ఒకప్పుడు తన రూపాన్ని చూసి నవ్విన వారే ఇప్పుడు ఆమె సాధించిన అద్భుతాలకు సెల్యూట్ చేస్తున్నారు. కష్టాలెన్ని ఎదురైనా, పట్టుదల ఉంటే శిఖరాలను కూడా అధిరోహించవచ్చనడానికి దీప్తి జీవాంజి జీవితం నిదర్శనంగా నిలుస్తోంది.

విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి- వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి

మొదటి పేజీ తరువాయి




భారత్ సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాది అని ప్రధానమంత్రి అన్నారు. "గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది. దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి. కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి. ఈ రోజు, వాటిని పరిష్కరించే బాధ్యత మనందరిపై ఉంది. మనల్ని విభజించాలని చూసే శక్తులకు వ్యతిరేకంగా మనం సమాజాన్ని ఏకం చేయాలి. మన పౌరుల్లో ఆత్మనిర్భరత పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తిని నింపాలి. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి. ఈ లక్ష్యాల కోసం మనం మరింత చురుకుగా వ్యవహరించాలి." వ్యక్తిగత పురోగతి అనేది జాతీయ అభివృద్ధికి ఒక సాధనంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వామి చిన్మయానంద బోధనలను, ధ్యాత్మిక వృద్ధిని దేశాభివృద్ధికి అనుసంధానించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అనే వేద మంత్రాన్ని చెబుతూ, దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా మార్చేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. "మిత్రులారా మన వేదాలు మనకు 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అని పిలుపునిస్తున్నాయి. అంటే దేశ శ్రేయస్సును కోరుకునేవారిగా, మనం దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా తీర్చిదిద్దాలి. స్వామి చిన్మయానంద తన జీవితాంతం ఈ మంత్రాన్నే స్ఫూర్తిగా తీసుకుని జీవించారు. ఆధ్యాత్మిక విషయాల గురించి ఆయన ఎంతటి అంకితభావంతో మాట్లాడేవారో, జాతీయ అంశాల గురించి కూడా అంతే ఉత్సాహంతో, స్పష్టతతో మాట్లాడేవారు. ఎందుకంటే మన దేశమే మన సంస్కృతికి జన్మస్థానం. పూజ్య గురుదేవ్ స్వామి చిన్మయానందను ఈ రూపంలో చూడటం, ఆయన హోలోగ్రాఫిక్ ప్రతిరూపంతో సంభాషించే అవకాశం లభించడంతో నేను 33 ఏళ్లు వెనక్కి ప్రయాణించినట్లు అనిపించింది. 1993లో వడోదరలో గురుదేవ్‌తో నా భేటీ, మా మధ్య జరిగిన సంభాషణలు, ఆయన చూపిన వాత్సల్యం, ఆయన ఆశీస్సులు అన్నీ ఈరోజు కళ్లముందు కదలాడాయి. ఈ అద్భుతమైన అనుభవాన్ని సాకారం చేసిన చిన్మయ మిషన్ సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆ సంభాషణలో ప్రధానాంశం యువశక్తిని పెంపొందించడం, తద్వారా ఒక బలమైన, సమర్థమంతమైన భారతదేశాన్ని నిర్మించడంపైనే చర్చించాం. వారిని కలిసిన కొన్నేళ్లకే, ప్రజలు నన్ను గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారు." భారతీయుల్లో తమ దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే స్వామి చిన్మయానంద లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. "ఈ దేశమే మన ఉనికికి పునాది. మన ఆధ్యాత్మిక పురోగతిని వ్యక్తిగత వికాసంతో అనుసంధానించాలని, దానిని దేశాభివృద్ధికి ఒక సాధనంగా మార్చుకోవాలని స్వామీజీ మనకు బోధించారు. భారతీయుల్లో దేశం పట్ల ఆత్మగౌరవాన్ని నింపడమే ఆయన లక్ష్యం. ఇదే ఉద్దేశంతో ఆయన 'గీతా జ్ఞాన యజ్ఞాన్ని' ప్రారంభించి, ఉపనిషత్తులు, వేదాంతం మన ఇతర శాస్త్రాల జ్ఞానాన్ని సామాన్య ప్రజల వరకు చేరవేశారు. ఆయన తీసుకున్న ఆ సంకల్పం ఫలితాలను ఇప్పుడు మనం చూడవచ్చు" అని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

దేశం ముందు వాస్తవాలు పెట్టండి'- మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు- చైనా పాలసీపై తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రశ్నలు సంధించారు. అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఇండో-డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "చైనాకు ఇచ్చిన క్లీన్ చిట్‌లు చాలు. ప్రధాని మోదీ భారత్ ముందు వాస్తవాలు చెప్పాలి! మూడు ప్రశ్నలకు సమాధానాలు కావాలి: 1. జాతీయ భద్రత: అరుణాచల్ ప్రదేశ్‌లో డ్రాగాతో ఘర్షణలు కొనసాగుతున్నాయని ఇండో డీజీ ధ్రువీకరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డోక్లాం, గల్వాన్ తర్వాత మరో తీవ్రమైన ఘర్షణ చోటుచేసుకుంటోందా? ఆగస్టులో టాక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లపై నివేదికలు వెలువడ్డాయి. అయినప్పటికీ, కేవలం 180 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు చెబుతున్న వాచా-దమాయ్‌లో కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు జరిగి 47 రోజులు గడిచినా, ఘర్షణలు కొనసాగుతున్నాయి. భారతదేశ గస్తీ మార్గాలకు ఆటంకం కలిగిందా? అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో విడదీయరాని భాగం. దేశాన్ని ఎందుకు చీకట్లో ఉంచుతున్నారు? 2. ఆర్థిక భద్రత: గల్వాన్‌లో 20 మంది భారత సైన్యపు వీరయోధుల త్యాగం తర్వాత, చైనా దిగుమతులు 102శాతం పెరిగాయి. అదే సమయంలో చైనాతో భారతదేశ వాణిజ్య లోటు 155శాతం పెరిగి 112.16 బిలియన్ డాలర్లకు చేరింది. భారత ఎగుమతులకు చైనా ఆటంకం కలిగిస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అంగీకరిస్తున్నారు. అయినా, ప్రభుత్వం చైనా పెట్టుబడులపై ఆంక్షలను సడలిస్తూ, అర్హత కలిగిన చైనా అనుబంధ సంస్థలకు పీఎల్ఐ (గా×) ప్రయోజనాలను పరిశీలిస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' కాస్తా 'ఇంపోర్ట్ ఫ్రమ్ చైనా'గా మారిందా? 3. దౌత్యపరమైన జవాబుదారీతనం: కనీసం 23 సార్లు మోదీ- జిన్ పింగ్ మధ్య సమావేశాలు, సంభాషణలు జరిగాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ 25 ప్రత్యేక ప్రతినిధుల పర్యటనలు చేశారు. 36 ఔవీజజ సమావేశాలు, వరుసగా ాజూ, దీ=×జూ శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. ఈ కార్యకలాపాలు ఎలాంటి స్పష్టమైన ఫలితాలను అందించాయి? మే 2020కి ముందు భారతదేశానికి ఉన్న గస్తీ హక్కులు పూర్తిగా పునరుద్ధరించారా? మన సాయుధ దళాలపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. కానీ జాతీయ భద్రతకు జవాబుదారీతనం అవసరం, అంతేగానీ దౌత్యపరమైన ఫోటో, ఆలింగన రాజకీయాలు కాదు! ప్రతిపక్షంపై దాడి చేయడానికి బదులుగా, ప్రధాని మోదీ పార్లమెంటు, దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి."



కేంద్రం వైఖరితో దేశానికి ఏమి దక్కింది : ఖేడా

అటు కేంద్రం భారతదేశ ప్రయోజనాలను చైనాకు అప్పగించిందని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించారు. బీజింగ్ పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరి వల్ల దేశానికి ఏమి దక్కిందని ప్రశ్నించారు. ఏప్రిల్ 2020కి ముందు భారత బలగాలు ప్రవేశించిన ప్రాంతాల్లో ఇప్పుడు గస్తీ నిర్వహించగలవా అని అడిగారు. దిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖేడా మాట్లాడారు. సరిహద్దు ఉద్రిక్తతలు, వాణిజ్య సంబంధాలు, వీసా ఆంక్షలు, భారతదేశంలోకి చైనా కార్మికుల ప్రవేశం వంటి అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. "మనకు ఏమి దక్కింది? చైనా వ్యతిరేకత వల్ల మనకు ఎలాంటి హోదా లభించింది? ఏప్రిల్ 2020కి ముందు మనం గస్తీ కాసిన ప్రదేశాల్లో ఈ రోజు గస్తీ కాయగలమా? వీటన్నిటికీ బదులుగా మీరు ఏదైనా తీసుకోవాల్సింది కాదా? దేశంలోని ఎంఎస్ఎంఈలను నాశనం చేస్తారు. మీరు చైనాకు భయపడి, చైనా కోరుకున్నది ఏదైనా చేస్తారు. కేవలం చైనాకు భయపడటం వల్లే మీరు భారతదేశ ప్రయోజనాలను చైనాకు అప్పగిస్తూనే ఉన్నారు. మీరు తొలగించిన ప్రయాణ ఆంక్షలైనా, 99 బిలియన్ డాలర్ల నుంచి 112 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్య లోటు అయినా, పరిమితం చేసిన వీసాలు అయినా, ఇక్కడికి వచ్చే చైనా కార్మికులకు, చైనా అధికారులకు మీరు అకస్మాత్తుగా మళ్లీ వీసాలను పెంచుతున్నారు. దీనివల్ల భారతదేశానికి ఏమి జరుగుతుంది? ఈ లొంగిపోవడం వల్ల మనం సాధించింది ఏమిటి?" అని ఖేడా ప్రశ్నించారు.

అనంత సూర్య తెలుగువార



రమేష్ అన్నా.. గెలిచేది నువ్వే..

నువ్వు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు

16వ డివిజన్లో ప్రజల నుంచి వైసీపీకి పెద్ద ఎత్తున మద్దతు

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రమేష్ గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజల ధీమా







అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 16వ డివిజన్లో వైసీపీకి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. “రమేష్ అన్నా.. గెలిచేది నువ్వే.. నువ్వు టెన్షన్ పడాల్సిన అవసరం లేదు” అంటూ ప్రజలు వైసీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్‌కు, 16వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పి.కోనమ్మకు తమ విశ్వాసాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, కార్పొరేటర్ అభ్యర్థి పి.కోనమ్మ 16వ డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, రమేష్ గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థించారు. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై కూడా అభ్యర్థులు చర్చించారు. డివిజన్‌లోని ప్రజలు మాట్లాడుతూ.. వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందుకే ఆయన ఎలాంటి టెన్షన్ పడాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైసీపీ నాయకుడు బండి శ్రీకాంత్, వాసగిరినాగ్, లక్ష్మన్న, భార్గవ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా కార్యకర్తలు గడప గడపా తిరిగి, ఓటర్లను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు.

వైసీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



వైసీపీ లీగల్ విభాగం నాయకులు నీరజా ఆధ్వర్యంలో తమ నివాసం వద్ద ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి, మేయర్ అభ్యర్థి సి.రమేష్, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మీసాల రంగన్న, మాజీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, రాయలసీమ బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు బళ్లారి వెంకట రాముడులతో పాటు ముఖ్య నాయకులు, లీగల్ సెల్ నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో మనం చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం జరుగుతున్న అరాచక పాలనను గురించి ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి మేయర్ అభ్యర్థి సి.రమేష్‌తోపాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

49వ డివిజన్‌లో ప్రచారంలో దూసుకెళ్తున్న హరిఫా



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 49వ డివిజన్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి హరిఫా ప్రచారంలో దూసుకుపోతున్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామని, అందుకు తనకు ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్న తనతోపాటు మేయర్ అభ్యర్థి సి.రమేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతపురం నగరం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని హరిఫా తెలిపారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఖాదర్ బాషా, గుజ్జుల నల్లప్ప, గుజ్జుల లక్ష్మణ్ కుమార్, సందీప్, ఓబుళపతితోపాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నార్పల జెడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన ప్రవీణ్ నామినేషన్ దాఖలు

అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :



నార్పల జెడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల ఆర్వోకు నామినేషన్ పత్రాలను అధికారికంగా అందజేశారు.

అనంత నగరాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే వైసీపీని గెలిపించాలి : మేయర్ అభ్యర్థి సి.రమేష్



అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రహీమ్ ఖాద్రి మస్జీద్ (ఖబ్రస్తాన్), నూరని మస్జీద్‌ల సమీపంలో వైయస్సార్ సీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ మైనార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనతోపాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో ముస్లిం మైనార్టీలకు జరిగిన మేలును వివరించారు. అనంతపురం నగరాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైస్సార్సీపీ రాష్ట్ర సెక్రటరీ గౌస్ బేగ్, రాష్ట్ర మైనారిటీ విభాగం సెక్రటరీ నదీమ్, మైనార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై పరిటాల శ్రీరామ్ వ్యూహాత్మక అడుగులు

- **జిల్లాలో ముఖ్య నేతలతో వరుస భేటీలు**
- **మంత్రి సవితమ్మ, ఎంపి పార్థసారథి, మాజీ మంత్రి పల్లెతో మర్యాదపూర్వక భేటీ**
- **పరిటాల ఘాట్ వద్ద తండ్రి రవీంద్రకు ఘన నివాళి**



శ్రీ సత్యసాయి, అక్టోబర్ 23 అనంత సూర్య :

శ్రీ సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలపై ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు. నల్లచెరువు జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కూటమి యువనేత పరిటాల శ్రీరామ్ జిల్లావ్యాప్తంగా తన రాజకీయ పర్యటనలను ముమ్మరం చేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జిల్లాలోని ముఖ్య నేతలందరినీ వరుసగా కలుస్తూ సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా నామినేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజుతో కలిసి పరిటాల శ్రీరామ్ పుట్టపర్తిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలు, కూటమి శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి క్లీన్ స్వీప్ దిశగా ఎలాంటి వ్యూహాత్మక చర్యలు తీసుకోవాలో, క్యాడర్‌ను ఎలా సమన్వయం చేసుకోవాలో ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. అక్కడి నుంచి నేరుగా పుట్టపర్తిలోనే ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నేత పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను, పెనుగొండలో మంత్రి సవితమ్మని, అనంతపురంలో ఎంపీ బీకే పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాను జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన విషయాన్ని వారికి తెలియజేస్తూ ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, స్థానిక పోరులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ నేరుగా తన స్వగ్రామమైన రామగిరి మండలం వెంకటాపురానికి చేరుకున్నారు. అక్కడ ఇలవేల్పు యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పరిటాల రవీంద్ర స్మారక చిహ్నమైన ‘పరిటాల ఘాట్’ వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. తండ్రి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించిన శ్రీరామ్.. కాసేపు అక్కడే గడిపారు. శ్రీరామ్ వరుస భేటీలతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూటమి క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహం వ్యక్తమవుతోంది.

హిందూ ముస్లింల మధ్య గొడవలకు వైసీపీ కుట్ర చేస్తోంది

- **వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
- **58, 59 డివిజన్లలో విస్తృతంగా ప్రచారం**
- **తెలుగుదేశం పార్టీలో చేరిన ముస్లిం యువత**
- **అనంత వెంకట్రామిరెడ్డి ముసలి రాజకీయాలకు కాలం చెల్లింది.. ఎమ్మెల్యే దగ్గుపాటి**



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

అనంతపురం నగరంలో హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ నాయకులు నీచమైన ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి అభ్యర్థుల తరపున ఆయన ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరంలోని 58, 59 డివిజన్లలో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, పరిశీలకుడు ఏరాసు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, మేయర్ అభ్యర్థి అజేష్ బాబు, కూటమి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 59వ డివిజన్‌లో ఎమ్మెల్యే సమక్షంలో ముస్లిం మైనార్టీ నాయకులు జైన్, పవన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముస్లిం యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇవాళ శుక్రవారం మసీదు వద్ద తాము ప్రచారానికి వెళ్లినప్పుడు వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అయితే కూటమి నాయకులు అత్యంత సంయమనంతో వ్యవహరించి గొడవలు జరగకుండా చూశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముసలి రాజకీయాలకు కాలం చెల్లిందని, యువత ఉన్న చోట వారి ఆటలు సాగవన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపు పేరుతో గత మేయర్, గత ఎమ్మెల్యే కలిసి 2 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని అబద్ధాలు చెప్పి 22 కోట్ల ప్రజా ధనాన్ని దోచుకున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 3 లక్షల టన్నుల వ్యర్థాలను ఎత్తివేసే కార్యక్రమం చేపట్టామని, ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే అక్కడ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పార్కును ఏర్పాటు తీసుకొస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రానికి 25 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని, రైజింగ్ రాయలసీమ పేరుతో ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, ఇక్కడ హార్టికల్చర్ హబ్‌ను కూడా తీసుకొచ్చినట్లు చెప్పారు. గతంలో కియా పరిశ్రమ రావడం వల్లే నేడు 50 వేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. పైన కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంటేనే అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి సాధ్యమని, ఇక్కడ కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ బాబును, 58వ డివిజన్ అభ్యర్థి దళవాయి నాగరత్నను, 59వ డివిజన్ అభ్యర్థి రాయల్ మురళిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు ప్రజలకు హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ అర్షద్‌ుల్లా, నాయకులు దళవాయి వెంకటనారాయణ, వన్నూరప్ప, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

31 డివిజన్‌లో బొమ్మనేని శివ ప్రచారం



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 31వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొమ్మినేని శివ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. డివిజన్‌లోని ప్రతి ఇంటిలోనూ సాదరంగా ఆహ్వానం పలికారు. కార్పొరేటర్‌గా తనను ఆశీర్వదించి, సైకిల్ గుర్తుకు ఓటేయాలని ఓట్లను అభ్యర్థించారు. అలాగే బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు అమర్ యాదవ్, శిరిశాల రాంబాబు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




1వ డివిజన్‌లో రాజేంద్ర ప్రచారం

ప్రతి ఇంటిలోనూ సాదర ఆహ్వానం.. ఆత్మీయత పలకరింపు

అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 1వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జోగి రాజేంద్ర ఎన్నికల ప్రచారం జోరందుకుంది. డివిజన్‌లోని ప్రతి ఇంటిలోనూ సాదరంగా ఆహ్వానం పలికారు. అదేవిధంగా ముస్లిం మైనార్టీలందరికీ తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. అలాగే బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చక్రవర్తి, దూదేకుల రఫి, తిమ్మప్ప, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి సంగాల సురేష్



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

ఇటీవల వైయస్సార్ సీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వెళ్లిన 61వ డివిజన్ నాయకుడు సంగాల సురేష్ తిరిగి వైయస్సార్ సీపీలోకి చేరారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థి మాల పాటి వాసంతి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు, ఇంచార్జ్ వెంకటేష్, స్థానిక నాయకులు ప్రసన్నలక్ష్మి, శైలజా, రంగా యస్వంత, డిష్ మధు, రాము, రాజశేఖర్ చారి, తిరుపతి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



యువత ఉద్యమాల్లో.. రమేష్‌ది కీలకపాత్ర

ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న ట్రెండ్ జెన్‌జీని ఆకర్షించడమే.. నిరుద్యోగం, పేపర్ లీకేజీ, ఓట్ చోరీ తదితర అంశాలపై జెన్‌జీ ఆందోళన తదితర కారణాలతో అన్ని రాజకీయ పార్టీలు యువతను ఆకర్షించే పనిలో పడ్డాయి.

అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

అనంతపురం నగరంలో యువత చాలా చైతన్యవంతులు.. కాక్రోచ్ పార్టీ ఆందోళనలను బీజేపీ ఉక్కుపాదంతో అణిచి వేయాలని ప్రయత్నించడంతో ఆ పార్టీపై సహజంగా యువతలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆ ప్రభావం తమ పార్టీ కార్పొరేటర్లపై కూడా పడుతుందేమోనని ఆందోళన తెలుగుదేశం పార్టీలో కూడా వ్యక్తమవుతోంది. మేయర్ అభ్యర్థిగా ఉన్న అజేష్ నగర ప్రజలకు పెద్దగా పరిచయం లేకపోవడం, బీసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ పట్ల యువతలో సానుభూతి ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు ఉన్న బీజేపీకి ఓటు వేస్తేనే ప్రయోజనం ఉంటుందనే విషయాన్ని బీజేపీ.. ఓటర్లలోకి బలంగా తీసుకెళ్తోంది. వైసీపీ అధినేత జగన్ కాక్రోచ్ పార్టీకి మద్దతు తెలపడంతో యువత ముఖ్యంగా నిరుద్యోగ యువత వైసీపీ పట్ల ఆకర్షితులయ్యే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ భావిస్తోంది. దీనికితోడు ఇటీవల కాలంలో జగన్.. బీజేపీ విధానాలను వ్యతిరేకించడం కూడా మైనార్టీ వర్గాలు పూర్తిస్థాయిలో వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌కు మద్దతు తెలిపే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఓటు బ్యాంకు ఉన్న సీపీఐ, సీపీఎం లాంటి వామపక్ష పార్టీలన్నీ బహిరంగంగానే మేయర్ రమేష్ గౌడ్‌కు మద్దతు ప్రకటించాయి. సౌమ్యుడు అయిన రమేష్ గౌడ్ సమైక్యాంధ్ర ఉద్యమంలో సైతం కీలక పాత్ర పోషించాడు. బీసీ ఉద్యమ నాయకుడిగా తెరమీదికి వచ్చిన రమేష్ గౌడ్ అన్ని వర్గాల వారితో సన్నిహితంగా ఉంటూ వస్తుండడం ఆయనకు మరో ప్లస్ పాయింట్.. ఏది ఏమైనప్పటికీ నవంబర్ 1న ఓటర్ల నాడి ఏవిధంగా ఉంటుందో అర్థమవుతుంది.

మార్నింగ్ వాకర్స్‌తో రమేష్ గౌడ్ మాటామంతీ..

అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :



అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్‌లో ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో ఉదయాన్నే మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్ పార్క్‌కు వచ్చి, అక్కడ ఉదయం నడకకు వచ్చిన సీనియర్ సిటిజన్లు, మార్నింగ్ వాకర్లతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. అనంతపురం నగరాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి వైసీపీ అభ్యర్థులకు అండగా నిలవాలని రమేష్ గౌడ్ కోరారు. మేయర్‌గా గెలిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, నగర సమస్యలపై ప్రాధాన్యతతో పని చేస్తానని ఆయన తెలిపారు. పార్క్‌లో వాకింగ్ చేస్తున్న పెద్దలు, యువకులు, స్థానికులతో మాట్లాడే అవకాశం దొరకడం సంతోషంగా ఉందన్నారు. నగరంలో మౌలిక సదుపాయాలు, పార్కుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీరు, రోడ్లు వంటి అంశాలపై ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలకు విలువిస్తానని ఆయన చెప్పారు. అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌కు, అలాగే 62 డివిజన్లలో పోటీ చేస్తున్న వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని ఆయన ఓటర్లను కోరారు. వైసీపీ అభ్యర్థులు గెలిస్తే నగర అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. రమేష్ గౌడ్ ప్రజలతో నేరుగా మాట్లాడే శైలికి స్పందిస్తూ.. సీనియర్ సిటిజన్లు నగర సమస్యలపై తమ సూచనలు అందించారు.

నల్లచెరువు జడ్పీటీసీగా పరిటాల శ్రీరామ్ నామినేషన్

- జిల్లాలో సరికొత్త రాజకీయ పరిణామం
- ఎమ్మెల్యేలు కందికుంట, ఎంఎస్‌లతో కలిసి శ్రీరామ్ నామినేషన్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తామన్న పరిటాల శ్రీరామ్
- గతంలో లాగా దౌర్జన్యాలు లేవు.. స్వేచ్ఛగా నామినేషన్లు జరుగుతున్నాయన్న శ్రీరామ్





శ్రీసత్యసాయి, అక్టోబర్ 23 అనంత సూర్య :

శ్రీ సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ సరికొత్త రాజకీయాలు తెరపైకి వచ్చాయి. ఎవరూ ఊహించని విధంగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎలాంటి హడావుడి లేకుండా, అత్యంత సాదాసీదాగా ఆయన ఈ నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ వెంట కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అన్ని చోట్లా క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో లాగా దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు ఇప్పుడు లేవని స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా జరుగుతోందని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకునే అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరితోనూ నామినేషన్లు వేయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన సూచనలు చేశారని శ్రీరామ్ గుర్తుచేశారు. సీఎం ఆదేశాల ప్రకారమే ఇవాళ తమతోపాటు ఇండిపెండెంట్లు, అన్ని రాజకీయ పార్టీలవారు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని తెలిపారు. గత మూడు రోజులుగా ఈ నామినేషన్ల ప్రక్రియ అంతా ప్రశాంతంగా సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమం, ప్రగతిని చూసి ప్రజలు కచ్చితంగా తమ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తారని పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల శ్రీరామ్ జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూటమి శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం కనిపించింది..

53వ డివిజన్‌లో 'ఫ్యాన్' జోరు

ప్రచారంలో దూసుకెళ్తున్న రహంతుల్లా



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

నగరపాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్‌లో 'ఫ్యాన్' జోరందుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ రహంతుల్లా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇంటింటికీ వెళుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. మళ్లీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నిత్యం అందుబాటులో ఉంటానని, మళ్లీ తనను ఆశీర్వదించాలని షేక్ రహంతుల్లా ఓటర్లను వేడుకున్నారు. ఈ ఎన్నికల్లో కార్పొరేటర్, మేయర్ అభ్యర్థుల గుర్తు అయిన 'ఫ్యాన్'కు వేయాలని ప్రజలను కోరారు. ప్రచారంలో నాయకులు చంద్ర, అరవింద్ రమేష్, సూరి, సద్దాం, నూరుల్లా, వరాలు, పద్మ, చంద్రకళ, బాబ్ జాన్, సంజీవులు, తేజస్విని, మస్తానమ్మ, సుందర్, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో దూకుడు పెంచిన ఎమ్మెల్యే దగ్గుపాటీ...

- కూటమి అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం
- ప్రచారంలో పాల్గొన్న మేయర్ అభ్యర్థి రాజేష్ సతీమణి స్నేహలత, అభ్యర్థులు
- గత రెండున్నరేళ్లుగా మేము చేసిన అభివృద్ధే మా నినాదం.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- గొడ్డలి పార్టీ ఎన్నికలు జరగకూడదని కుట్రలు చేస్తోందన్న దగ్గుపాటి



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

జగన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ గొడ్డలి పార్టీ గత ఐదేళ్ల పాలనలో ఎక్కడా ఎలాంటి అభివృద్ధి చేయకుండా, ఇప్పుడు ఎన్నికలు జరగకుండా కుట్రలు చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి అభ్య ర్థుల తరుఫున ఆయన ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మేయర్ అభ్యర్థి రాజేష్ సతీమణి స్నేహలతతో కలిసి 9వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ అభ్యర్థి నాగరత్న, 10వ డివిజన్ అభ్యర్థి రెడ్డిశ్వరి, 11వ డివిజన్ అభ్యర్థి కంఠాదేవి, 14వ డివిజన్ అనసూయమ్మల తరఫున కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను, కూటమి సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు.మా కాలనీల్లో అనేక సమస్యలు పరిష్కా రమయ్యాయని ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూటమికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల దుర్మార్గపు పాలనలో ఎక్కడా ఎలాంటి అభివృద్ధి చేయని జగన్ పార్టీ, ఇప్పుడు ఓటమి భయంతో ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తోందన్నారు. ఎన్నికల్లో ఉద్దేశపూర్వకంగా ఘర్షణ వాతావరణం సృష్టించడమే కాకుండా, పోలింగ్ జరగ కుండా న్యాయపరమైన, రాజకీయపరమైన కుట్రలు చేస్తోం దన్నారు. కానీ ఎన్నికల కమిషన్ నవంబర్ 1వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది, ప్రజలు ఓటు ద్వారా జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గత రెండున్నరేళ్లుగా కూటమి ప్రభుత్వం చేసిన ప్రజాహిత కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనే మా నినాదమ న్నారు. గత 25 ఏళ్లుగా ఏ ప్రభుత్వాలు పట్టించుకోని స్థానిక కాలనీల సమస్యలను సైతం మేము అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పరిష్కరించామన్నారు. ప్రజలం తా ఆలోచించి కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తేనే డివిజన్ల వారీగా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యం గా ఇక్కడ బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ గెలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో దశాబ్దాలుగా వేధిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను కచ్చితంగా పరిష్కరించి తీరుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, నాయకులు కుంచపు వడ్డే వెంకటేష్, సుంకన్న, గుర్రం నాగభూషణం, రాప్తాడు రంగా తదితరులు పాల్గొన్నారు.



జానకమ్మా.. మా ఓటు నీకేనమ్మా !

ప్రతి గడపలోనూ ఆప్యాయత.. సాదర ఆహ్వానం



అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :

ఏమ్మా.. జానకమ్మా ! బాగున్నావా.. నిన్ను చూస్తుంటే ఆనందంగా ఉందమ్మా.. మా ఓటు నీకేనమ్మా.. అంటూ ప్రతి గడపలోనూ ఆప్యాయతతో పలకరింపు ఎదురైంది. సాదరంగా ఆహ్వానిస్తూ.. 'సైకిల్' గుర్తు ఓటేస్తామంటూ భరోసా ఇస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని 46వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కురుబ చిట్రా జానకి ప్రచారం చేపట్టారు. ప్రచారంలో ఎక్కడికెళ్లినా.. ఆమెను సాదరంగా ఆహ్వానించి ఆప్యాయతతో పలకరిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే కూటమి ప్రభుత్వానికి ఓటు వేయాలని వేడుకున్నారు. కార్పొరేటర్ అభ్యర్థి తనతోపాటు బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ గుర్తు అయిన కమలం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను వేడుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

61 డివిజన్‌లో.. 'ఫ్యాన్' స్పీడు..

మాలపాటి వాసంతికి అడుగడుగునా నీరా'జనం'

అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :



నగరపాలక సంస్థ పరిధిలోని 61వ డివిజన్‌లో 'ఫ్యాన్' స్పీడందుకుంది. అడుగడుగునా వైసీపీ అభ్యర్థి మాలపాటి వాసంతికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ప్రతి గడపలోనూ ఆప్యాయతతో ఆహ్వానించి.. ఈసారి మా ఓటు నీకేనమ్మా.. అంటూ ఆశీర్వదిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. మళ్లీ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నిత్యం అందుబాటులో ఉంటానని, తనను ఆశీర్వదించాలని ఓటర్లను వేడుకున్నారు. కార్పొరేటర్ అభ్యర్థి అయిన తనకు, మేయర్ అభ్యర్థి అయిన రమేష్ గౌడ్‌కు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైసీపీ మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తరిమెల నాగిరెడ్డి 50వ వర్ధంతి కార్యక్రమ కరపత్రం విడుదల

అనంతపురం, అక్టోబర్ 23 అనంత సూర్య :



అనంతపురం ఆర్ట్స్ కాలేజీ కామర్స్ సెమినార్ హాల్‌లో 25వ తేదీ ఉదయం 10 గంటలకు తరిమెల నాగిరెడ్డి జీవితం గురించి రూపొందించిన మ్యాన్ ఆఫ్ ద ఎర్త్ అనే డాక్యుమెంటరీ చిత్రం ప్రదర్శన జరుగుతుందని నాయకులు తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఎన్నికై ప్రజా వాణిని సమర్థ వంతంగా వినిపించిన ఆయన 1976లో మరణించారు. ఈ సందర్భంగా ఆయన అలోచనా దృక్పథం గురించి క్లుప్తమైన సభ కూడా ఉంటుందని, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ఆహ్వాన పత్రికను శుక్రవారం స్థానిక రజక నగర్ కమ్యూనిటీ హాల్లో ప్రజా సంఘాల నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి, కార్మిక నాయకులు మల్లికార్జున, నవ యువ సమాఖ్య జిల్లా నాయకులు మల్లీశ్వరి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405